సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 18 । జూలై । 2025



ఒంటరి మహిళలే టార్గెట్

ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. -8లో



ఎమ్మెల్యే చెప్పారని పట్టా భూమిలో రోడ్డేశారు

ఎమ్మెల్యే చెప్పారంటూ తమకు చెందిన స్థలంలో అక్రమంగా రోడ్డు వేశారని ఓ మహిళ కన్నీటి పర్యంతమయ్యారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.7/27.7

జిల్లాలో గురువారం 27.7 - 36.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఏప్రిల్ 30వ తేదీ వరకు సర్వీసులో ఉన్న ఒప్పంద అధ్యాపకులు 2025-26 విద్యా సంవత్సరానికి రెన్యూవల్స్ చేసుకోవాలని కడప జిల్లా ఐడి కళాశాల(ఆర్ట్స్ కళాశాల) ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. వారు పని చేస్తున్న కళాశాలల్లోని ప్రిన్సిపాల్‌లకు ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్: కడప శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాలలో 1996-2000 సంవత్సరాల మధ్య ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. కళాశాల 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ అల్యుమినీ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజ్ అభివృద్ధిపై చర్చ, సామూహిక భోజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూర్వ విద్యార్థులు 8123417684కు వివరాల కోసం ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

నాలుగు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాతో పాటు వైఎస్ఆర్ కడప జిల్లాలోని పలు మార్కెట్ యార్డ్ కమిటీలకు సర్కార్ చైర్మన్ లను నియమించింది.. మదనపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి కేటాయించగా బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించారు.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పి.విజయలక్ష్మి(బీజేపీ), అన్నమయ్య జిల్లా రాయచోటి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బోడిరెడ్డి రాంప్రసాద్ రెడ్డి (టీడీపీ), లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎస్ ఎండి షఫీ, మదనపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా జంగాల శ్రీనివాస్(జనసేన)ను నియమించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం పేర్లు ప్రకటించింది. అధికారికంగా ఆదేశాలు రావాల్సి ఉంది.

బాలిక హత్యపై స్పందించిన కమిషన్

కడప కోటిరెడ్డి సర్కిల్: గండికోటలో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని సంఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న వైష్ణవి ఇంటి నుంచి బయలుదేరి, ఆ తర్వాతకు హత్యకు గురైందని పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఇంటర్ విద్యార్థిని చనిపోవడం బాధాకరమని, వారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొంది. ఎన్ని గంటలకు వెళ్లింది, ఎక్కడి నుంచి వెళ్లింది, సంఘటన జరగడానికి కారణాలు తదితరాలపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని జిల్లాలోని సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించింది.

తిరుపతి- చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆగస్టులో తిరుపతి-చర్లపల్లి మధ్య మరో ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ప్రతి ఆదివారం, సోమవారం ఈ రైలు రాకపోకలు సాగిస్తుందని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తిరుపతిలో ఆగస్టు 3, 10, 17, 24వ తేదీల్లో (ఆదివారం) 07481 రైలు 9.10 గంటలకు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు. రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్డు, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజ్‌గిరి మీదుగా చర్లపల్లికి వెళ్తుందన్నారు. ప్రతి సోమవారం చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి.. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదల



కేసీ కెనాల్‌కు నీటిని వదులుతున్న ఎమ్మెల్యే

వల్లూరు: మండలంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద పెన్నానది నుంచి కేసీ కెనాల్‌కు గురువారం నీటిని విడుదల చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పూజలు జరిపి అనంతరం గేట్లు తెరిచి కాలువకు నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ చిన్న పుల్లయ్య, ఏఈ గంగిరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మెన్ వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎరువు.. కరువు



నా పేరు వేమిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి. మాది దువ్వూరు మండలం క్రిష్ణంపల్లి గ్రామం. నాకు 15 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం 4 ఎకరాల్లో అరటి, 6 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశాను. పంటల సాగుకు సంబంధించిన ఎరువులను గతంలో మేము మా గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. దువ్వూరులోని ప్రైవేటు డీలర్ల వద్ద అతి కష్టం మీద తెచ్చుకున్నాను. యూరియా కావాలని ప్రత్యేకంగా అడికితే కాంప్లెక్స్ ఎరువులను తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు చెబుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులు అవసరం లేకపోయినా యూరియా కోసం కొనక తప్పడం లేదు. పైగా గతంలో గ్రామంలోని ఆర్‌బీకే సిబ్బంది విత్తనాలు, ఎరువులను పరీక్షించి నకిలీవా, నాణ్యమైనవా పరిశీలించి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విత్తనాలు, ఎరువులను బయట నుంచి తెచ్చుకుని సాగు చేసుకోవాల్సి వస్తుంది. అవి మంచివో లేక నకిలీవో తెలియని పరిస్థితి నెలకొంది. ఇన్ని ఆటుపోట్ల మధ్య వ్యవసాయ సాగు భారంగా ఉంది.

- ప్రభుత్వం అరకొరగా మంజూరు
- విత్తనాల కేటాయింపు అంతంత మాత్రమే
- అధిక ధరకు విక్రయిస్తున్న డీలర్లు
- అన్నదాతకు తప్పని అవస్థలు



సాగులో ఉన్న పత్తి పంట

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఊర్లలోనే రైతన్నలకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో లభించేవి. నేడు ఆ పరిస్థితి కరువైంది. ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రాలకు పరుగు తీయాల్సి వస్తోంది. దీంతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో ఖరీఫ్‌లో 77475 హెక్టార్ల సాగు లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటినా వర్షం లేకపోవడంతో.. సాగు పనులు అంతగా ఊపు లేవు. రెండు రోజుల క్రితం కేసీ కాలువకు నీటిని విడుదల చేశారు. దీంతో కేసీ కెనాల్ కింద రైతన్నలు పంటల సాగుకు సమాయత్తం అయ్యారు. అయితే ఎరువులు, విత్తనాలు అవసరం మేరకు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు వ్యక్తులపైన ఆధార పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలను అరకొరగా కేటాయించడంతో.. ఈ పరిస్థితి నెలకొంది. దీంతోపాటు ఎరువులు సకాలంలో సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రైవేటు డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపినా.. తక్కువగా కేటాయింపు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 69,653 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు పంపగా.. ఇందులో 40,390 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఇందులో 7146.30 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే మంజూరు చేశారు. గతేడాదివి 27073.08 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా.. ఇందులో రీటైలర్, హోల్‌సెల్ డీలర్ల వద్ద 26,466.74 మెట్రిక్ టన్నుల ఉంచగా.. రైతు సేవా కేంద్రాల్లో కేవలం 606.38 మెట్రిక్ టన్నులు ఉంచారు. ఈ విషయంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలలో అధిక ఎరువులను ఉంచితే రైతులకు సమస్య లేకుండా పోయేదని పేర్కొంటున్నారు. ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వాపోతున్నారు.

జిల్లాలో పంటల సాగు వివరాలు

పంట పేరు	సాధారణ సాగు (హెక్టార్లలో)	సాగైన పంట (హెక్టార్లలో)
వరి	30804	1571.43
జొన్న	517	6
సజ్జ	1089	358
మొక్కజొన్న	932	717.44
కంది	5761	42
మినుము	3806	827.7
వేరుశనగ	5976	870.93
సన్‌ఫ్లవర్	1142	65.7
సోయాబీన్	1030	21
పత్తి	24036	2429.07

ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు సంబంధించి..

- ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు 20538 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలను పంపగా.. ఇందులో 12025 టన్నులు కేటాయించారు. ప్రస్తుతం 3062.3 టన్నులను మాత్రమే మంజూరు చేశారు.
- డీఏపీకి సంబంధించి 9862 మెట్రిక్ టన్నులు అవసరంగా ప్రతిపాదనలు పంపగా.. 4860 మెట్రిక్ టన్నులను కేటాయించారు. ప్రస్తుతం 1826 టన్నులు మంజూరు చేశారు.
- కాంప్లెక్స్ ఎరువులు 32704 మెట్రిక్ టన్నులు అవసరంగా ప్రతిపాదనలు పంపగా.. 20195 టన్నులు కేటాయించారు. ఇందులో ప్రస్తుతం 2258 టన్నులు మంజూరు చేశారు.
- ఎంఓపీకి సంబంధించి 2791 టన్నుల కోసం ప్రతిపాదనలు పంపగా, 1620 టన్నులు కేటాయించారు.. కానీ ఏమీ మంజూరు చేయలేదు.
- ఎస్ఎస్‌పీకి సంబంధించి 3758 మెట్రిక్ టన్నులు అవసరంగా ప్రతిపాదనలు పంపగా.. ఇందులో 1690 టన్నులు కేటాయించారు. కానీ ఏమీ మంజూరు చేయలేదు. ఇలా మొత్తంగా ఖరీఫ్ సీజన్‌కు 69,653 మెట్రిక్ టన్నుల ఎరువులకు గాను కేవలం 7146.3 మెట్రిక్ టన్నులు మాత్రమే మంజూరు చేశారు.

రీటైల్స్, హోల్‌సెల్, ఆర్ఎస్‌కేలలో కలిపి..

గతేడాది రీటైలర్స్, హోల్‌సెల్, ఆర్ఎస్‌కేల ద్వారా పంపిణీ చేయగా.. మిగిలిన ఎరువులను రీటైలర్స్, హోల్‌సెల్, ఆర్ఎస్‌కేలలో అందుబాటులో ఉంచారు. ఇందులో యూరియా రీటైలర్ వద్ద 3546.52 మెట్రిక్ టన్నులు, హోల్‌సెల్ డీలర్ల వద్ద 2630.57 మెట్రిక్ టన్నులు ఉండగా.. రైతు సేవా కేంద్రాలలో కేవలం 321.03 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

- డీఏపీకి సంబంధించి రీటైలర్ వద్ద 1121.65 మెట్రిక్ టన్నులు, హోల్‌సెల్ డీలర్ల వద్ద 1544 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రంలో 136.4 టన్నులు అందుబాటులో ఉన్నాయి.
- కాంప్లెక్స్‌లు రీటైలర్ వద్ద 7236.76 టన్నులు, హోల్‌సెల్ డీలర్ల వద్ద 5204.92 టన్నులు, రైతు సేవా కేంద్రంలో 101.45 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి.
- ఎంఓపీ రీటైలర్ వద్ద 1648.60 మెట్రిక్ టన్నులు, హోల్‌సెల్ డీలర్ వద్ద 1241.35 మెట్రిక్ టన్నులు, ఆర్ఎస్‌కే కేంద్రాల్లో 47.75 టన్నులు ఉంచారు.
- ఎస్ఎస్‌పీకి సంబంధించి 2074.04 మెట్రిక్ టన్నులు రీటైర్స్ వద్ద, 218.35 మెట్రిక్ టన్నులు హోల్‌సెట్ వద్ద ఉండగా.. ఆర్ఎస్‌కేలో మాత్రం లేవు.

విత్తనం.. గగనం

- జీలుగలు 3308.7 టన్నులు కేటాయించగా.. ఇందులో 1967.8 టన్నులు మంజూరు చేయగా.. 1222 టన్నులు రైతులు తీసుకెళ్లారు.
- జనుములు 982.1 కేటాయించగా, ఇందులో 862.4 మంజూరు చేయగా 487.9 టన్నులను రైతులు తీసుకెళ్లారు.



- వేరుశనగ 3577 టన్నులు కేటాయించగా, 2718.6 మంజూరు చేయగా.. ఇందులో 2673.9 టన్నులు రైతులు తీసుకుని వెళ్లినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

యూరియా దొరకడం లేదు



నేను ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ప్రస్తుతం యూరియా అవసరం ఉంది. యూరియా కొందామంటే దొరకడమే లేదు. ఒక వేళ దొరికితే.. యూరియాతోపాటు కాంప్లెక్స్ ఎరువులు కొనాలని డీలర్లు సూచిస్తున్నారు.

- వెంకటసుబ్బయ్య, తుడుమలదిన్నె, ఖాజీపేట

ఎరువుల రేట్లను పెంచడం అన్యాయం



రసాయనిక ఎరువుల రేట్లను పెంచడం చాలా అన్యాయం. ఎరువుల పెరుగుదల ప్రభావం వ్యవసాయంపైన తీవ్రంగా పడుతుంది. సాగుకు కౌలు రైతులు ముందుకు రాక, సొంత భూమి ఉండే రైతులు వ్యవసాయం చేయలేకపోతున్నారు.

- సహదేవరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు

40,390 మెట్రిక్ టన్నుల కేటాయింపు



2025 ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ నుంచి జూలై వరకు 40930 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు కేటాయించారు. ఇందులో ఇప్పటికి 7146.3 మెట్రిక్ టన్నుల వివిధ రకాల కంపెనీల ఎరువులను జిల్లాకు సరఫరా చేశారు.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి



కొబ్బరి చెట్టు కొమ్మలేసింది

కొబ్బరి, తాటి చెట్లకు సాధారణంగా కొమ్మలు ఉండవు. కాండం ఒకటే ఉంటుంది. అది నిటారుగా పెరుగుతుంది. పైభాగంలో ఆకులు ఉంటాయి. అయితే కొమ్మలున్న చెట్లు అరుదుగా కనిపిస్తాయి. కొబ్బరి చెట్లకు ప్రసిద్ధి అయిన కోనసీమలో.. అక్కడక్కడా ఉంటాయి. అక్కడ కూడా ఐదారు కొమ్మల కన్నా ఎక్కువగా కనిపించవు. అలాంటి కరువు సీమ అయిన మన కడపలో కొబ్బరి చెట్టు కొమ్మలేయడం విశేషం. నగరంలోని మాసాపేటలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుకు కాండంతోపాటు రెండు కొమ్మలు ఉన్నాయి. ఇది చూపరులను ఆకర్షిస్తోంది. రెండు కొమ్మల్లోనూ కొబ్బరి కాయలు కాస్తుండటంతో.. ఆ ఇంటి వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

సెల్‌ఫోన్‌లు లోపలికి ఎలా వచ్చాయి?

డీఐజీ ఎంఆర్.రవికిరణ్ విచారణ

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో అధికారులు తనిఖీల సమయంలో దశల వారీగా దొరికిన 12 సెల్‌ఫోన్‌లు, ఛార్జర్ వ్యవహారంపై డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్ గురువారం క్షుణ్ణంగా విచారణ చేశారు. సెల్‌ఫోన్‌లు లోపలికి ఎలా వస్తున్నాయనే అంశంపై లోతుగా విచారణ చేపట్టారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో నేరుగా కడప కేంద్ర కారాగారంలోకి వెళ్లిన డీఐజీ సెల్‌ఫోన్‌లు లోపలికి ఎలా వస్తున్నాయని సిబ్బందిని ప్రశ్నించారు. విచారణలో బయట నుంచి సెల్‌ఫోన్లు, ఛార్జర్ విసిరేస్తున్నారనీ చెప్పారు? దీంతో ఆయన లోపల నిలబడి బయట నుంచి ఏదైనా వస్తువు విసరండని ప్రాక్టికల్‌గా చేసిచూసినట్లు సమాచారం. పెట్రోల్ బంకు, డైరీ ఫాం, ఇంకా ఇతర అంశాలను విచారించి బాధ్యులపై చర్యలకు నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేఎంసీకి మూడో ర్యాంకు

జాతీయ స్థాయిలో 31వ ర్యాంకు


కడప కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో కడప మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)కు రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు లభించింది. జాతీయ స్థాయిలో 31వ ర్యాంకు వచ్చింది. 2019 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఇచ్చిన ర్యాంకుల్లో ఇదే అత్యుత్తమం కావడం గమనార్హం. 2019లో జాతీయ స్థాయిలో 62వ ర్యాంకు రాగా, 202లో 54, 2021లో 56, 2022లో 56, 2023లో 58వ ర్యాంకులు లభించాయి. 2024 సంవత్సరంలో నిర్వహించిన సర్వేల్లో కడపకు అతి తక్కువగా 31వ ర్యాంకు లభించింది. చెత్తను తడి, పొడి చెత్తలుగా విడదీయడంలో 48 శాతం, ఆ చెత్తలు ప్రాసెసింగ్ చేయడంలో 98 శాతం మార్కులు లభించాయి. గత ఏడాది జీఎఫ్‌సీ స్టేటస్‌లో త్రీస్టార్ రాగా, ఈ ఏడాది సింగిల్ స్టార్ వచ్చింది. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకపోవడం వల్ల ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) ప్లస్, ప్లస్ స్టేటస్ వచ్చింది. విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి నగరాల తర్వాత స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అన్ని విభాగాల్లో కడపకే ఎక్కువ మార్కులు పడ్డాయని చెప్పవచ్చు.



ఇంటింటి నుంచి చెత్తను వాహనం ద్వారా సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

అధికారమే దన్ను.. ఆశ్రమ స్థలంపై కన్ను

- మహర్షి ఆశ్రమం భూమి హాంఫట్
- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు
- భారీ విలువ ఉండగా.. కారు చౌకగా..
- రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పన్నాగం



మహర్షి ఆశ్రమం ముఖద్వారం



భవనాలను నేలమట్టం చేయడంతో ఖాళీగా కనిపిస్తున్న స్థలం



సాక్షి టాస్క్‌ఫోర్స్: రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా.. అన్న చందంగా అధికార పార్టీ నేతలు అనుకుంటే.. ఏమైనా చేయగలరు అనడానికి చక్కటి ఉదాహరణ.. ప్రొద్దుటూరులోని మహర్షి ఆశ్రమం కొనుగోలు వ్యవహారం. నిబంధనల ప్రకారం ఈ స్థలాన్ని కొనుగోలు చేయడానికి, అమ్మడానికి ఎవరికీ హక్కులేదు. కేవలం ఆశ్రమ నిర్వహణతోపాటు పేదలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు మాత్రమే పూర్వం మహర్షి విద్యామందిరాన్ని ఏర్పాటు చేశారు. అధికార పార్టీ అండతో స్థానిక ప్రజాప్రతినిధి తనయుడు చక్రం తిప్పి.. ఈ స్థలాన్ని కొనుగోలు చేయించారు. త్వరలో ఈ స్థలంలో వెంచర్ ఏర్పాటు చేసి వ్యాపారం చేయనున్నారు.

దానంగా ఇచ్చిన స్థలం

ప్రొద్దుటూరు పట్టణంలోని బొల్లవరంలో పూర్వం ఢిల్లీకి చెందిన మహర్షి విద్యామందిరం నిర్వాహకులు ఇక్కడ పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆశ్రమాన్ని నిర్వహించేందుకు ప్రయత్నించారు. అప్పట్లో గురుదేవ్ రామిరెడ్డి ఈ ఆశ్రమానికి కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ ఆశ్రమ నిర్వహణ తీరును మెచ్చి బొల్లవరానికి చెందిన కందుల బాల నారాయణరెడ్డి కుమారుడు నరసింహారెడ్డి ఎకరా 15 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చారు. సర్వే నంబర్ 592లోని ఈ స్థలాన్ని 1978 ఆగస్టు 21న రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. తర్వాత కాలంలో నరసింహారెడ్డి కుటుంబీకులు తమకు ఉన్న మరో 50 సెంట్ల స్థలాన్ని మహర్షి ఆశ్రమానికి అమ్మడం జరిగింది. మొత్తం ఎకరా 65 సెంట్లలో ఆశ్రమాన్ని, పాఠశాలను నడిపేవారు. గత కొన్నేళ్లుగా ఆశ్రమ నిర్వహణ గురించి నిర్వాహకులు పట్టించుకోవడం వదిలేశారు. ఈ కారణంగా ఈ సంస్థలో ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. విలువైన ఈ స్థలాన్ని మాత్రం కాపాడుకుంటూ వచ్చారు.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి..

చుట్టూ జనావాసాల మధ్య ఉన్న ఈ స్థలం విలువ ప్రస్తుతం పెరిగింది. ఇక్కడ సెంటు స్థలం విలువ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు పలుకుతోంది. సుమారు రూ.20 కోట్ల విలువైన ఈ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొనుగోలు చేయాలని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికార పార్టీ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తూ వచ్చారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులు ఈ స్థలాన్ని కారుచౌకగా కొనుగోలు చేశారు. ఇందులో ప్రజాపతి తనయుడు స్లీపింగ్ పార్టనర్‌గా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఈ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వివాదం కూడా చోటు చేసుకుంది. ఆశ్రమ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుని మొత్తం స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసి తాజాగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

భవనాలు జేసీబీతో నేలమట్టం

గత పది రోజులుగా ఆశ్రమంలోని జ్ఞాన మందిరం, పాఠశాల భవనాలతోపాటు ఇతర నిర్మాణాలను జేసీబీతో తొలగించి నేలమట్టం చేశారు. దానంగా ఇచ్చిన ఈ స్థలంలో పాఠశాలను నిర్వహించాలని, ఆశ్రమాన్ని నెలకొల్పాలని ఈ స్థలంపై తనకు, తన వారసులకు ఎలాంటి హక్కు లేదని ఆనాడే నరసింహారెడ్డి రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్నారు. ఈ ప్రకారంగా దానంగా ఇచ్చిన భూములు, స్థలాలను అమ్ముకునే హక్కు కల్పిస్తే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.

నాడు సమాజ హితం కోసం..

ప్రొద్దుటూరులోని ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ కళాశాలకు మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తండ్రి నాగిరెడ్డి పూర్వం పది ఎకరాలకుపైగా స్థలాన్ని దానంగా ఇచ్చారు. అలాగే ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వం మాజీ ఎమ్మెల్యే పేర్ల శివారెడ్డి తండ్రి పేర్ల నాగిరెడ్డి 10 ఎకరాలకుపైగా స్థలం ఇచ్చారు. నాడు సమాజ శ్రేయస్సు కోసం ధనవంతులు భూములను విరాళంగా ఇచ్చే పరిస్థితి ఉండేది. నేడు అందుకు భిన్నంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సమాజ హితం కోసం ఇచ్చే స్థలాలను ఆక్రమిస్తున్నారు.

ప్రభుత్వ సేవలపై సంతృప్త స్థాయి పెంచాలి

ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్ రోడ్స్: ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచేలా పనిచేయాల్సి ఉంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు స్టోన్ ఫౌండేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జీరో పావర్టీ, పీ-4పాలసీ, బంగారు కుటుంబాలు, మార్గదర్శులు గ్రామ సభలు, జనాభా నిర్వహణ అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా జిల్లాలో మిగిలిన వున్న గ్రామాలను కవర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరతయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం పీ.గోపాల్ రెడ్డి, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్.బాబు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన పి.కాశీప్రసాద్(54) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... బుధవారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో ప్రసాద్ కడపకు బయలుదేరాడు. యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు, దూడ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దు

మైలవరం : మండలంలోని తొర్రివేముల గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకట సుబ్బమ్మకు చెందిన ఎద్దు, అవు దూడ విద్యుత్ షాక్‌తో గురువారం మృతిచెందాయి. బాధితురాలి వివరాల మేరకు.. పొలం వద్ద గడ్డి మేపుకోవడానికి సుబ్బమ్మ ఎద్దులు, ఆవుదూడలను విడిచిపెట్టింది. బోరుబావి వద్ద ఉన్న స్టార్టర్ వద్దకు వెళ్లిన ఎద్దు పొరపాటున స్టార్టర్‌కు తగలడంతో అక్కడ ఉన్న తీగలు పశువులపై పడ్డాయి. విద్యుత్తు షాక్ తగలడంతో రెండు పశువులు మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించినట్లు తెలిపారు.

బోగాధమ్మ ఆలయంలో చోరీ



ఆలయం వెలుపల పడేసిన హుండీ

కమలాపురం : మండలంలోని పందిళ్లపల్లె శివారులో ఇటీవల పునర్నిర్మించిన బోగాధమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళం పగులగొట్టి హుండీని రంపంతో కోసి అందులో నగదు చోరీ చేశారు. ఆలయం బయట పడేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

రైల్వే స్టేషన్ గోదాములో తనిఖీలు



రైల్వే స్టేషన్ ర్యాక్ వద్ద పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్ : కడప రైల్వేస్టేషన్‌లోని రేక్ పాయింట్, ట్రాన్స్‌పోర్టు గోదాముల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కడప ఏవోలు గోవర్ధన్, సురేష్‌కుమార్‌రెడ్డి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎరువు నిల్వలు, పంపిణీకి సంబంధించిన పత్రాలు, రికార్డులు పరిశీలించారు. జిల్లాకు 991 మెట్రిక్ టన్నుల ఎరువు వచ్చినట్లు తెలిపారు. సరైన పత్రాలు చూపితేనే జిల్లాలోని డీలర్లు, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కేంద్రాలకు పంపిణీ చేయాలని సిబ్బందికి వారు సూచించారు. గోదాముల్లో నిషేధిత పురుగు మందులు ఉన్నాయా అని తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు పంపేవారు, తీసుకునేవారి చిరునామాలు నమోదు చేయాలని సూచించారు.

ధ్రువపత్రాల మంజూరులో దళారుల దందా

- ఉద్యోగులు, కొంతమంది డాక్టర్లతో కుమ్మక్కైన అక్రమార్కులు
- రీ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో యథేచ్ఛగా అవినీతి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ధ్రువపత్రాల మంజూరులో దళారుల దందా కొనసాగుతోంది. దివ్యాంగుల సర్టిఫికెట్లు ఇప్పించేటపుడు వికలత్వం ఉన్న వారిని మధ్య పెట్టి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. డాక్టర్లతో కొందరు ఉద్యోగులు కుమ్మక్కై లక్షల రూపాయలు అర్జిస్తున్నారు. కడప జిల్లా వ్యాప్తంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబర్ నెల వరకూ గడువు ఉండడంతో తాజాగా కడప రిమ్స్‌తోపాటు, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి, బద్వేల్, మైదుకూరు, కమలాపురం ఆసుపత్రులలో నూతన దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. బుధ, గురు, శుక్రవారాల్లోనూ ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సహజంగా వికలత్వం వుంటే భయపడాల్సిన పని లేదు. కాస్త, అటూ, ఇటూ వున్నా, తక్కువ వికలత్వం ఉన్న వారికి మాత్రం ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నూతన సర్టిఫికెట్ మంజూరు చేయిస్తామని చెప్పి జిల్లా వ్యాప్తంగా 18 మంది దళారులు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో దళారీ తమ పరిధిలో 50 నుంచి 100 దాకా సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో ఓకే చేయించుకున్నట్లు తెలిసింది. రిమ్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమకు చేతనైన సహాయం చేస్తూ తాయిలాలు అందుకున్నట్లు తెలిసింది.

బయోమెట్రిక్ వేయగానే ఆన్‌లైన్

సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ రోజున దివ్యాంగులు నేరుగా డీఆర్‌డీఏ అధికారుల వద్ద బయోమెట్రిక్ వేసి హాజరైనట్లు నమోదు చేసుకుంటారు. వాటిల్లో కొన్నింటిని మాత్రమే డాక్టర్లు చూసి పరవాలేదు అని పిస్తే సర్టిఫికెట్ మంజూరు చేసేస్తున్నారు. దీనిని దళారులు ఆసరాగా తీసుకున్నారు. దళారులతో కుమ్మక్కైన కొందరు డాక్టర్లు బయోమెట్రిక్ వేసిన వారి నుంచి డబ్బు అందించదని టోకెన్ ఇవ్వగానే ఆన్‌లైన్ చేసేస్తున్నారు. ఈఎన్‌టీ విభాగంలో ఓ డాక్టర్‌తో కుమ్మక్కై దళారులు ఈ ప్రక్రియ భారీగా కొనసాగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం ఓ ఆడియాలజిస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకొని దళారుల తాయిలాలు తీసుకున్న జూనియర్, సీనియర్ అసిస్టెంట్(గతంలో సదరం ఇన్‌ఛార్జిలుగా పనిచేసిన)ల తోపాటు, చిరుద్యోగులు ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అందిన సొమ్ముతో కొందరు ఉద్యోగులు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతూ, వ్యసనాలకు బానిసలై విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలుస్తోంది. గత వారం రోజులుగా కడప ఆర్టీసీ బస్టాండు పరిసరాల ప్రాంతాలు, లాడ్జీలు, హోటళ్లలో దళారులు మకాం వేసినట్లు సమాచారం. రిమ్స్ అధికారులు వారి ఆగడాలకు చెక్ పెట్టకపోతే అసలైన దివ్యాంగులకు అన్యాయం జరిగేందుకు అవకాశం వుంది.

ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్ ప్రారంభం



చెన్నకేశవ (5 వికెట్లు)



కిరణ్‌కుమార్ (5 వికెట్లు)



అనెల్ లియో (83 పరుగులు)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు గురువారం ప్రారంభమయ్యాయి. కడప వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తొలి రోజున కడప–కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలుచుకున్న కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రుత్విక్ కల్యాణ్ 40 పరుగులు, రోహిత్ గౌడ్ 35 పరుగులు చేశారు. కడప జట్టులోని చెన్నకేశవ అద్భుతంగా చక్కటి లైనప్‌తో బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశాడు. అదే విధంగా జయప్రణవ శాస్త్రి 2, క్యాసిరెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు–అనంతపురం జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 59.5 ఓవర్లకు 224 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని అలెన్ లియో 61 పరుగులు, సుశాంత్ 42 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టి.కిరణ్‌కుమార్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశారు. సంజయ్ 2, దేవాన్ష్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 34 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాత్విక్ 23 పరుగులు చేశాడు దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

రైతుకు సోలార్ ముప్పే

- భార్యపేరిట భూములున్నా భర్త పేరుతో ఒప్పందం
- ఇచ్చి తీరాలంటూ సోలార్ యాజమాన్యం బెదిరింపులు



తన పొలంలో సోలార్ ప్యానెల్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు చూపుతున్న బాధితురాలు

జమ్మలమడుగు/మైలవరం : సోలార్ ప్యానెల్ ముప్పు రైతులకు సంకటంగా మారుతోంది. భూముల యజమానుల అనుమతి లేకుండానే పొలాల్లో ప్యానెల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రత్యేక బృందాలతో బెదిరింపులకు దిగుతున్నారు. ఏదో ఒక లింకు పెట్టి భూములను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. పెద్దముడియం మండలం కల్వటాల గ్రామంలో సెల్(ఎస్‌ఏఈఎల్) కంపెనీ సోలార్ ప్రాజెక్టు చేపడుతోంది. తమ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసేందుకు నిబంధనలకు పాతర వేస్తోంది. రైతులు తమ పొలాలు ఇవ్వకున్నా.. ఏదో లింకు పెట్టి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. స్థానిక రైతులపై రోజురోజుకూ బెదిరింపుల పర్వం పెరిగిపోతోంది. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి పొలాల యజమానులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. విచిత్రమేమిటంటే గతంలో చాలామంది రైతులను తప్పుదోవపట్టించి భూములను లీజుల రూపంలోనూ, కొనుగోలు రూపంలో తీసుకున్న సంస్థ వ్యక్తులు ఇపుడు కొత్త కోణాన్ని తీసుకువస్తున్నారు. భార్య పేరు మీద భూములుంటే భర్తలను మధ్యపెట్టి ఇంట్లో వారికి సమాచారం లేకుండానే ఒప్పంద పత్రం రాయించుకుంటున్నారు.

నాకు తెలియకుండా ప్యానెల్ ఏర్పాటు చేశారు

కొందరు వ్యక్తులు నా పొలానికి వచ్చి సోలార్ సంస్థకు భూములు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. నాకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 2.69 ఎకరాల భూమి నా పేరిట ఉంది. నా భర్త గోపాల్‌తో సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు అగ్రిమెంట్ చేసుకున్నామని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెప్పారు. నా పేరిట భూమి ఉన్నపుడు నాకు తెలియకుండా ఎలా ఒప్పందం చేస్తారో అర్థం కాలేదు. నా భర్తతో సంతకం చేయించుకున్నారు. నా పొలం పక్కన ఉన్న కొంత ప్రభుత్వ భూమిని నగదు ఖర్చు చేసి చదును చేశాం. ఆ మొత్తం చెల్లిస్తామని కంపెనీ వారు నా భర్తకు చెప్పినా ఇవ్వలేదు. ఇపుడు రూ.1.5 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాం.. 30 ఏళ్ల ఆ పట్టా భూమి లీజుకు తీకున్నామని కంపెనీ యజమానులు చెప్పారు. నా కుమార్తెలకు పెళ్లి చేయాలంటే ఆ భూమే ఆధారం. నా అనుమతి లేకుండా ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తే పోలీసులచే ఒత్తిడి తీసుకువస్తున్నారు. నాకు న్యాయం చేయాలి.

– పామిడి వరలక్ష్మి, కల్వటాల

ఒంటరి మహిళలే టార్గెట్

- చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన దొంగ అరెస్ట్
- రూ.15.32 లక్షల విలువైన చైన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం
- విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



స్వాధీనం చేసుకున్న బంగారు చైన్లు, మోటార్ సైకిల్

కడప అర్బన్ : ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 52 గ్రాముల బంగారు చైన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో విలేకరులకు గురువారం వివరాలు తెలిపారు. జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన పట్టనేతి నవీన్(26) గత కొద్ది నెలలుగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు. కడప రూరల్ సీఐ చల్లనిదొర, పెండ్లిమర్రి ఎస్ఐ జి.మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది ఈ నెల 2వతేదీన నవీన్‌ను అరెస్ట్ చేశారని తెలిపారు. విచారించి అతడి నుంచి 1,150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని జైలుకు పంపినట్లు తెలిపారు. అనంతరం జూలై 16న పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించగా నిందితుడు నవీన్ ఆరుచోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు రుజువైందని తెలిపారు, తొండూరు, చెన్నూరు, పులివెందుల, గంగిరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్, కమలాపురం, పెండ్లి మర్రి పోలీస్ స్టేషన్లలోని పలు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. అక్కడ చోరీ చేసిన బంగారు చైన్లు అమ్మడానికి ప్రయత్నించినప్పుడు దుకాణదారులు నిందితుడిని తగిన రసీదు చూపించమని అడిగారన్నారు. భయంతో తిరిగి తన ఇంటిలోనే బంగారు గొలుసు దాచి పెట్టారని తెలిపారు. ఈ క్రమంలోనే నిందితుడిని విచారించి బంగారు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు, రికవరీ చేయడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐలతోపాటు క్రైమ్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బాషా, బి.రవికుమార్, సుభాన్‌బాషా, కిరణ్‌కుమార్, సూర్యప్రకాశ్‌రెడ్డిలను ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని హనుమద్గిరి గ్రామం వద్ద స్కూటరిస్ట్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. కొండాపురం మండలం చౌటిపల్లె గ్రామానికి చెందిన తలారి మాణిక్యరాజు సొంత పనుల నిమిత్తం జమ్మలమడుగుకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌లో వెళ్తుండగా ముద్దనూరు రహదారి నుంచి వస్తున్న కారు ఢీకొంది. తలకు తీవ్ర గాయాలవడంతో మాణిక్య రాజును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌బీకేల ద్వారా ఎరువులు సరఫరా చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



డీఆర్వో విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప సెవెన్ రోడ్స్ : ఖరీఫ్ రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేల ద్వారా బస్తా రూ.267కే సరఫరా చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడును గురువారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయడంతో వరి, ఉల్లి, పత్తి, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు ఎరువులు లభించక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బయట మార్కెట్‌లో బస్తా రూ.350 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఆర్‌బీకేలో సమాధానం చెప్పే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు కావస్తున్నప్పటికీ రైతులకు ఏ ఒక్క సాయం చేయలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతు భరోసా కింద రూ.13500 ఇచ్చారన్నారు. తాము అధికారంలోకి వస్తే పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు చేసిన వాగ్దానం ఇప్పటికీ నెరవేరలేదని విమర్శించారు. వరి, మినుము తదితర పంటలకు కనీస మద్దతు ధర లేక రైతు అవస్థపడుతున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఖరీఫ్ పంటలకు నష్టం జరిగితే పరిహారం అందించి ఆదుకున్నామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సున్నా వడ్డీ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు.

ఇన్‌చార్జి కలెక్టర్ తీరుపై ఆగ్రహం

రైతు సమస్యలపై వినతిపత్రం సమర్పించాలని ముందస్తుగా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌ను అపాయింట్‌మెంట్ కోరగా.. సాయంత్రం 5 గంటలకు వచ్చి కలవాలని ఆమె క్యాంప్ క్లర్క్ ద్వారా చెప్పారని రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తాము కలెక్టరేట్‌కు వస్తే ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా ఆమె వెళ్లిపోవడం బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వస్తే ఎవరూ పట్టించుకోవద్దని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసిందా అంటూ ఆయన ప్రశ్నించారు. అధికారులు తమ వైఖరి మార్చుకొని అందరికీ అందుబాటులో ఉండాలని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, చెన్నూరు ఎంపీపీ చీర్లసురేష్ యాదవ్, సీహెచ్ వినోద్‌కుమార్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షఫీ, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షఫీ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో ఉత్కంఠ

- ఒకచోట చంపి మరోచోట వేసినట్లు గుర్తించిన పోలీసులు
- చంపింది ఎవరు అన్న కోణంలో దర్యాప్తు

జమ్మలమడుగు : మైనర్ బాలిక హత్య కేసు కొలిక్కి రాలేదు. నిన్నటి వరకు హత్య కేసులో పురోగతి వచ్చిందని, క్లూ దొరికిందని త్వరగా ఛేదిస్తామని పోలీసులు ప్రకటించారు. ఆ కేసులో బాయ్‌ఫ్రెండ్ లోకేష్‌పై మొదట అనుమానపడ్డారు. విచారణలో అతని ప్రమేయం లేదని డీఐజీ స్వయంగా ప్రకటించారు. అందరిచూపు బంధువులపై పడటంతో విచారణ చేపట్టారు. గురువారం కడప నుంచి క్లూస్‌టీం మరోసారి గండికోటలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మైనర్ బాలికను ఒక చోట చంపి మరోచోట మృతదేహాన్ని వేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మరిన్ని ఆధారాలు దొరుకుతాయనే అనుమానంతో పోలీసులు క్లూస్ టీంతో గండికోటలో పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు.

పోలీసుల అదుపులో ఆరుగురు!

మైనర్ బాలిక హత్య కేసులో అనుమానంతో పోలీసులు మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతురాలి సమీప బంధువులు మరో ముగ్గురిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హత్య కేసులో రాజకీయ జోక్యం అనివార్యం కావడం, ఉన్నతాధికారులు తిష్టవేసి ప్రతిదీ వాకబు చేస్తుండడంతో దర్యాప్తు పురోగతి సాధ్యం కావడం లేదని తెలుస్తోంది. స్థానికంగా అధికార పార్టీ నాయకుల దగ్గర పనిచేస్తున్న ఓ వ్యక్తికి మృతురాలు బంధువు కావడంతోపాటు ఎలాగైనా కుటుంబ సభ్యులను రక్షించే ప్రయత్నం జరుగుతోందనే ప్రచారం ఉంది. ఉన్నతస్థాయి అధికారులు తిష్టవేసి ఉండడంతో స్థానికులు సైతం తమకేందుకీ గొడవ అనే విధంగా ఏమి తెలియదని చెబుతున్నారని అందిస్తున్నారని సమాచారం.

కుటుంబ సభ్యుల చుట్టూ తిరుగుతున్న కేసు!

హత్య కేసులో లోకేష్‌కు ఎటువంటి సంబంధం లేదని డీఐజీ స్వయంగా చెప్పారు. సోమవారం ఉదయం గండికోటకు బాలికతో వెళ్లిన లోకేష్ రెండు గంటలు పాటు ప్రైవేటు వసతిగృహంలో ఉన్నారని తెలుస్తోంది. తర్వాత లోకేష్‌కు స్నేహితుల నుంచి.. వైష్ణవి సోదరులు నీ కోసం వస్తున్నారని సమాచారం అందడంతో గండికోట నుంచి పది గంటల తర్వాత ఒంటరిగా బయటికి వచ్చాడు. 11గంటల ప్రాంతంలో మృతురాలు గండికోటలో తిరిగినట్లు పక్కా ఆధారాలు సేకరించారు. లోకేష్ మైనర్ బాలికతో ఏకాంతంగా ఉన్న సమయంలో చోటుచేసుకున్న ఉదంతాలేవి వెలుగులోకి రాలేదు. ఇద్దరు ఆ సమయంలో ఏమి చేశారు? అన్న విషయాన్ని పోలీసులు బహిరంగపర్చలేదు. మరోవైపు కుటుంబ సభ్యులు పరువు హత్య చేశారనే దిశగా విచారణ చేపట్టారు. సంచలనం సృష్టించిన ఈ కేసులో ఓ రిటైర్డ్ డీఎస్పీ ఓవైపు, అధికార పార్టీ నాయకులు మరోవైపు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసులు సురేంద్రతో పాటు అతని సోదరుడు కొండయ్య, కుటుంబ సభ్యులను గురువారం విచారించారు.

పల్లెల్లో విద్యుత్తు అధికారుల తనిఖీలు

55 విద్యుత్తు చౌర్యం కేసులు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు అధికారులు గురువారం విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. మైదుకూరు డివిజన్ పరిధిలోని 40 మంది విద్యుత్తు సిబ్బంది 24 బ్యాచ్‌లుగా ఏర్పడి తనిఖీల్లో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై 55 కేసులు నమోదు చేసి రూ.2 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బి.మఠం సబ్ స్టేషన్ వద్ద జరిగిన సమావేశంలో మైదుకూరు డివిజన్ ఈఈ ఎస్.భరణీకృష్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వ్యవసాయ మోటార్లకు సంబంధించి రూ.3.59 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రూ.4 కోట్ల విద్యుత్తు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బిల్లులు వసూలు చేస్తామన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లు చెల్లిస్తే అపరాధ రుసుము పడదన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవిచంద్ర, డీఈఈలు కుళ్లాయప్ప, శ్రీకాంత్, ఏఏఓ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక వడ్డీల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు అమర్నాథ్ (ఫైల్‌ఫొటో)

సింహాద్రిపురం : అధిక వడ్డీల వేధింపులతో సింహాద్రిపురం మండలం అగ్రహారానికి చెందిన రైతు సాకే అమర్నాథ్(35) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మృతుడి భార్య గంగాదేవి కథనం మేరకు..

తన భర్త అమర్నాథ్‌కు 2 ఎకరాల భూమి ఉండడంతోపాటు ఫైనాన్స్‌లో జేసీబీ తీసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో ఖర్చులకు గానూ గ్రామంలో రూ.10 చొప్పున వారం వడ్డీ చెల్లిసూత్ గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి, మరింతమంది వద్ద అప్పు డబ్బు తీసుకున్నారు. ఆ వడ్డీ పెరిగి ఐదింతలు కాగా, ఒత్తిడి తట్టుకోలేక అప్పు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. దీంతో ఎనిమిది తులాల బంగారు వారికి ఇవ్వగా.. ఇంకా రూ.5 లక్షలు ఇవ్వాలని అడగడంతో అమర్నాథ్ ఇబ్బందిపడ్డారు. ఇది చెల్లించలేని పరిస్థితిలో తన రెండెకరాల భూమి అగ్రిమెంట్ లేకుండా దౌర్జన్యంగా తీసుకుని శంకర్‌రెడ్డి సాగు చేసేందుకు పొలం సిద్ధం చేశారన్నారు. అంతేగాక తన భర్తను ఫోన్‌ద్వారా వడ్డీ డబ్బు ఇవ్వాలని వేధించేవాడన్నారు. ఈ విషయం అమర్నాథ్ ఫోన్‌లో రికార్డు అయ్యింది. వేధింపులు తాళలేక అమర్నాథ్ మనస్థాపానికి గురై ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో పులివెందులలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య, బావమరిది అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి బాల వికాస్ స్కూల్ వెనుక నివాసముంటున్న దేరంగుల సుబ్బరాయుడు (32) హత్య కేసులో మృతుడి భార్య హరిత, బావమరిది హరికృష్ణను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

మద్యం తాగి రావడంతో భార్య హరిత, బావమరిది హరి కృష్ణ గొడవపడ్డారు. ఈ క్రమంలో సుబ్బరాయుడును గోడకేసి తోయడంతో పదునైన మోటు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ బి.రామకృష్ణ దర్యాప్తు చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



నాయునిపల్లెలో ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

కాశినాయన : ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని నాయునిపల్లె రెవెన్యూ పొలంలో ఆక్రమించిన ప్రభుత్వ, అటవీ భూములను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నాయునిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 129/1, 130, 217లో దాదాపు 300 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల చుట్టూ ట్రెంచ్ తీయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వెంటనే ఆక్రమిత పొలాల్లో నోటీసు బోర్డు ఏర్పాటుచేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, డీటీ రవిశంకర్, ఆర్ఐ అమరనాథ్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెప్పారని పట్టా భూమిలో రోడ్డేశారు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



రవీంద్రనాథ్‌రెడ్డి వద్ద విలపిస్తున్న బాధితురాలు సుబ్బలక్ష్మమ్మ

కడప రూరల్ : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ అనుచరులమంటూ కొంతమంది వచ్చారు. వారితోపాటే స్థానిక తహసీల్దారు తన సిబ్బందితో వచ్చారు. ఎమ్మెల్యే చెప్పారంటూ తమకు చెందిన 2.25 సెంట్ల స్థలంలో అక్రమంగా రోడ్డు వేశారు. న్యాయం చేయాలంటూ బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లెకు చెందిన మన్యం సుబ్బలక్ష్మమ్మ కన్నీటి పర్యంతమయ్యారు.

ఆమె తన కుమారుడు రామచంద్రారెడ్డితో కలిసి గురువారం కడపకు వచ్చారు. అక్కడ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఉండడంతో ఆయను తన సమస్య విన్నవించారు. తమ గ్రామంలోని సర్వేనెంబర్ 82లో 2.25 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈ నెల 5న సర్వేయర్ వచ్చి తమ భూమికి బౌండరీ లైన్ ఫిక్స్ చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటుచేశారని తెలిపారు. 16న తహసీల్దారు, కొందరు వ్యక్తులు వచ్చారని, తాము ఎమ్మెల్యే అనుచరులం అంటూ దౌర్జన్యం చేశారని ఆరోపించారు. దౌర్జన్యంగా తమ భూమి చుట్టూ వేసిన ఇనుప కంచె తొలగించారని ఆరోపించారు. అధికారులు తమకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా దారిని ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరుగకపోతే ఆత్మహత్య చేసుకుంటామని తెలిపారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి న్యాయం చేయాలని బద్వేల్ ఆర్‌డీఓకు ఫోన్ చేశారు. ఎమ్మెల్యే చెప్పారని నోటీసులు ఇవ్వకుండా పట్టా భూమిలో రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. తక్షణం బాధితురాలి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఇప్పటికే బద్వేల్ ఆర్‌డీఓ, జిల్లా ఏఎస్పీకి ఫిర్యాదు చేశామని, జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు.